# సైకిల్ పోయింది

శీలివేరు సూర్యచంద్ర

గణపతి మహా ఇదైపోతూ పోలీస్‌స్టేషన్‌లోకెళ్లి ''సార్సార్సార్! సేట్ బ్యాంక్ దగ్గర నేను సైకిల్ పెట్టి బీగమేసి మా ఊరి పిల్లకాయ ఎలా ఉంటాడో సూచ్చామని బ్యాంకులోకెళ్లి తిరిగొచ్చేసరికి నా సైకిల్ కనిపించలేదు. ఎలాగైనా నా సైకిల్ ఎతికిపెట్టండి'' టెన్షన్ పడుతూ చెప్పాడు ఎస్సైతో.

ఎస్సై నరసింహ్మం మీసాలు సర్దుకుని ''సైకిల్ పోయిందనీ, స్కూటర్ పోయిందనీ, శీలం పోయిందనీ వందలమంది వస్తుంటారు.''

ఆయన చెప్పాల్సింది చెప్పకముందే గణపతి అందుకుని ''సైకిళ్లు, స్కూటర్లు పోతే కట్ట పడి ఎతికితే దొరికితే దొరకచ్చు. పోతే తిరిగిరాన్ది శీలం పోతే మీరెక్కడ్నించి తెచ్చివ్వగలర్లెండి సారూ'' చేతులు కట్టుకుని అన్నాడు.

నరసింహ్మం సింహంలా ఘీంకరించి ''ఊ... పచ్చి పల్లెటూరి మనిషిలా వున్నావు. జోకులకేం కొదవలేదు'' అని ఒక్కక్షణం ఆగి ''చెప్పు నీ సైకిలెలా వుంటుంది?'' అనడిగాడు.

సైకిలును ఐదు నిముషాలు బుర్రలో ఊహించేసుకుని ''రెండు గాన్లు, రెండు బేకులు, ఒకటి తొక్కే సీటు, ఒకటి ఎనక కూకునే పెద్ద సీటు, ఇంకా రెండు ఫెడల్లు, ఒకటి బీగం అంతేనయ్యా'' చెప్పాడు గణపతి.

ఎస్సైకి చుర్రున మండింది. సర్రున సీట్లోంచి లేచి ''ఒకటి మట్కారేకు, ఒక చైను, నీ తద్దినం, నా పిండా కూడు'' కోపంగా అన్నాడు.

''అయ్ బాబోయ్! అలా మండి పడకండి సార్. మీరడిగారని నేను సెప్పాను'' వినయంగా కొంత వెనక్కు జరిగాడు గణపతి.

నరసింహ్మం కోపాన్ని అణచుకుంటూ ''నువ్వు చెప్పినవి ప్రతి సైకిలుకూ ఉంటాయి. నీ సైకిల్‌ను గుర్తించాలంటే ఎలా? ప్రత్యేక గుర్తులుంటే చెప్పరా?'' కసిగా అడిగాడు.

గణపతి ఎస్సై కళ్లల్లోకి ఒక్కసారలా సూటిగా చూసి ''లెంపలేస్కోండి. పాపమొచ్చేస్తుంది. ఎట్టయినా నేను వయసులో ఐదారేళ్ళు పెద్దే వుంటాను. నన్ను ఒరే అంటే మీ ఆయుష్షు తగ్గిపోద్ది. నా పేరు గణపతి. పతి అని పిలిస్తే చాలు'' అని కాసేపాగి ''నా సైకిలు అట్లాస్ కంపెనీది. సీటు పచ్చది. మెత్తసీటేం కాదు. గంట మాత్రం కొడితే గణగణగణమని మోత మోగుతుంది. బేకులు బెమ్మాండంగా పడ్తాయ్'' అంటూ ఏవేవో గుర్తులు చెప్పాడు.

ఇక సైకిలు నెంబరడిగితే వున్న తల కూడా నంజుకు తింటాడేమోనని గ్రహించిన ఎస్సై మర్యాదగా ''గణపతిగారూ! మీ సైకిలును వెదికే బాధ్యతను ఈ రోజు నుండే.. కాదు కాదు ఇప్పటినుండే స్వీకరిస్తున్నాను. వారం తరువాత కలవండి'' అని చెప్పి గణపతిని పంపించేసి మూలనున్న కూజాలోని నీళ్లు ఓ చెంబుడు తాగి హాయిగా గాలి పీల్చుకుని 'అబ్బ! బుర్ర తినేసాడు పల్లెటూరి మొద్దు' అనుకున్నాడు.

• • •

వారం గడిచింది.

ఎస్సై నరసింహ్మం హడావుడిగా స్టేషన్‌లోకెళ్లాడు. ఓ మూలన గణపతి కూర్చున్నాడు. గణపతిని చూసిన ఎస్సై 'చచ్చాన్రా దేవుడోయ్. ఈ తిక్కమనిషి కరెక్టుగా వారానికి ప్రత్యక్షమయ్యాడు' అనుకొంటుంటే గణపతి లేచి ''నమస్కారములు సారో'' అన్నాడు వినయంగా.

''ఆ.. ఆ.. సర్సర్లె కూర్చో కూర్చో'' మర్యాదిచ్చాడు ఎస్సై.

పతి కూర్చోకుండా ఎస్సై టేబుల్ వద్దకు వచ్చి ''పోయిన సోమారం పొద్దనపూట పదకొండు గంటల్కు సైకిల్ పోయిందని వచ్చి చెప్పాను. మీరు వారానికి రమ్మన్నారు. ఈ రోజు సోమారం. మీకోసం ఎదురు చూత్తన్నాను. నా సైకిలేమైనా దొరికిందా?'' ఆశగా అడిగాడు.

నరసింహం చికాకు పడుతూ 'స్కూటర్లు, కార్లు, లక్షలు పోయినా రిపోర్టిచ్చి చావడంలేదు, ఇచ్చినా ఫలితముండదని. ఈ అమాయకుడేంటి సైకిల్ పో... దుకే ఇలా పీక్కుతింటున్నాడు. నిజంగా మేము వెతి... తెచ్చి ఈయన చేతుల్లో పెడతామనుకుంటున్నాడేమో పిచ్చిమనిషి' అనుకుంటూ ''పతిగారూ! మీ సైకిల్ కోసం చాలా కష్టపడి వెతికాము. అయినా దొరకలేదు'' అన్నాడు.

పతి కంగారు పడుతూ ''అయ్‌బాబోయ్. అలా అంటే ఎలాసామీ? మీరెలాగైనా కట్టపడి నా సైకిల్ నాకొచ్చేలా చేయండి'' చేతులు కట్టుకుని దండం పెట్టాడు.

''మీరు చెయ్యెత్తి అలా మొక్కకండి. నాకు ఆయుష్షు తగ్గుతుంది. అసలే ఆడపిల్లలుగలవాడ్ని.''

''నాక్కూడా ముగ్గురాడపిల్లలున్నారు సారూ. ఇప్పుడు పోయిన ఆ సైకిల్ మీదే సింతపండు, తెల్లవాయలు, కెబ్బెర... అమ్ముకుని బతికేవాన్నయ్యా. ఇప్పుడు రోజూ సైకిలుకు పదైదు రూపాయలు బాడుగ ఇవ్వాల్సి వచ్చింది. రెక్కాడితేగానీ డొక్కాడని పేదోన్ని. సైకిల్ పోగొట్టుకున్నానని నా పెళ్లాం నన్ను అత్త గీకినట్టు గీకి పారేచ్చుంది. నేను సెప్పేది సోది అని ఇసిగిచ్చుకోకుండా నా సైకిల్ నాకొచ్చే మార్గం సూడండయ్యా!''

నరసింహం కరిగి ముద్దయిపోయాడు.

''పతీ! నీ పరిస్థితిని చూస్తే నాకు జాలేస్తోంది. నీ సైకిల్ దొరకాలని, దాన్ని నా చేతులమీదుగా నీకివ్వాలని మనసారా కోరుకుంటున్నాను. ఇక వెళ్లిరా'' అన్నాడు.

''మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు?'' ఆశగా అడిగాడు గణపతి.

''రెండువారాల తరువాత '' ఆలోచించి చెప్పాడు నరసింహం.

గణపతి వందనాలు పెట్టి వెళ్లాక ''పల్లెటూరి జిడ్డుపీనుగ. సైకిల్ సైకిల్ అని చంపుకుతింటున్నాడు. ఎంత కష్టపడి వెతికితే మాత్రం పోయిన సైకిల్ దొరుకుతుందా?. అది కల్లో మాటే. నాలుగు తిట్లు తిట్టి పంపుదామనుకుంటే ఆ పాత గోచీ, చేతుల బనియన్, జిడ్డు జుట్టు, అమాయకత్వం చూస్తుంటే అలా తిట్టాలనిపించలేదు. ఇప్పుడు పీడ వదిలించుకోవాలని రెండువారాల తర్వాత రమ్మన్నాను. వస్తే ఏ సాకు చెప్పాలో ఏమో? భగవంతుడా! ఈ పతి పీడ నుండి నువ్వే నన్ను రక్షించాలి'' అని దేవుడ్ని వేడుకున్నాడు.

• • •

మళ్లీ కరెక్టుగా రెండువారాలకు గణపతి స్టేషన్లో హాజరయ్యాడు. నరసింహ్మం గుండెల్లో పెద్ద బండ పడింది.

''నమస్కారం సార్‌గారూ! నా సైకిల్ కూడా దొరికింది కదా సార్'' వినయంగా చేతులు కట్టుకుని సంబరపడిపోతూ అడిగాడు.

ఎస్సై ఒక్కక్షణం కంగారుపడి ''అదేంటయ్యా అలా అడిగావ్? ఎవరికి దొరికింది నీ సైకిల్. వాడు నీ సైకిల్ నీకివ్వడంలేదా వాడి అడ్రస్ చెప్పు. నాలుగు పోలీస్ తన్నులు తన్ని నీ సైకిల్ నీకిప్పిస్తాను'' గజిబిజిగా అనేశాడు.


పతి తల బాదుకుని ''అయ్యో అలాకాదు సారూ. మొన్న సైకిల్ల, మోటారు సైకిళ్ళ దొంగలు అరెస్టు, కొన్ని వాకనాలు సాధీనం అని పేపర్లో ఏశారట. టీ అంగడి దగ్గర మనుసులు అనుకుంటుంటే ఇన్నాను. పనిలో పనిగా నా సైకిలు కూడా మన టేషన్‌కు వచ్చిందేమోనని

అనుకున్నాను'' అని ఒక్క నిముషం ఆలోచించి ''అందులో నా సైకిల్ లేదా సార్?'' అనడిగాడు కొంచెం బాధపడుతూ.

నరసింహం కుర్చీలో వెనక్కి జారి ''ఛ... ఈ పోలీస్ ఉద్యోగం కంటే బ్లాక్‌లో టిక్కెట్లమ్ముకోవడం బెటర్. ఇప్పుడు ఈ జిడ్డుగాని పీడ ఎలా వదిలించుకోవాలి. సైకిల్ సైకిల్ అని పీక్కుతింటున్నాడు'' అని టెన్షన్ పడుతూ లేని సహనం తెచ్చుకుని ''పతీ! నువ్వు స్టేషన్ చుట్టూ తిరిగి లాభంలేదయ్యా. నీ సైకిల్ దొరికేట్టు లేదు. ఇక మీదట సైకిలంటూ ఇటురాకు'' అన్నాడు. ఎలాగైనా టెన్షన్ నుండి బయటపడాలని.

గణపతి ఇదైపోతూ ''అలా అనకండి సార్. మీకు మనసు బాగాలేనట్టుంది. మరోసారి వస్తాను'' అని చెప్పి బయటకొచ్చాడు.

• • •



అప్పుడప్పుడు సైకిల్‌కని స్టేషన్ కెళుతూనే ఉన్నాడు గణపతి.

ఓరోజు సైకిల్‌కోసం వచ్చిన గణపతిని చూసి నరసింహం డంగైపోయి ''పతీ! నిన్ను స్టేషన్‌వద్ద చూడగానే నాకు గుండె దడ మొదలవుతోందయ్యా. భయంతో వణికి చస్తున్నాను'' అదోలా ముఖం పెట్టి అన్నాడు.

''అలా అంటారేంటి సార్. ఆరడుగుల ఎత్తున్నారు. అరగజం పొడవు, అరకిలో బరువు మీసాలున్నాయి. మీరు నన్ను చూసి భయపడుతున్నారా? వింటే ఎవరైనా నవ్వుతార్సార్.''

నరసింహం దీనంగా ముఖంపెట్టి ''అవును పతీ! నిన్ను చూసి నేను నిజంగానే ఝడుసుకుంటున్నానయ్యా. నువ్వొచ్చి సైకిలంటావ్. అది దొరకదు. వెతకమంటావ్. నీ స్థానంలో ఇంకెవరున్నా వాన్ని లాకప్‌లో వేసి లాఠీ విరిగిపోయేట్టు బాదిపారేసేవాడ్ని. కానీ నిన్ను, నీ అవతారాన్ని చూస్తుంటే లాఠీ పట్టాలనిపించడంలేదు'' అని చెప్పి కాసేపయ్యాక సీరియస్సయి ''చెప్పు నువ్వు నాకు కనిపించకుండా ఉండాలంటే నేనేం చేయాలో చెప్పు'' చివరకు ప్రాధేయపడ్డాడు.

''నా సైకిల్ నాక్కావాలి అంతే'' ముక్తసరిగా ఓ ముక్క చెప్పాడు.

ఎస్సైకి దిక్కుతోచలేదు. ఎలాగోలా వీడి పీడ వదిలించుకోవాలి అని అరగంటసేపు తీవ్రంగా ఆలోచించి ''పతీ! నాతో రా'' అంటూ బయటకు నడిచాడు నరసింహం. ఎస్సైని అనుసరించాడు పతి.

ఎస్సై స్టేషన్ ఆవరణలో ఓ మూలనున్న సైకిల్‌ను చూపించి ''దాదాపు రెండేళ్లనుండి ఈ సైకిల్ ఇక్కడే పడివుంది. ఇది నాదంటూ ఎవరూ రాలేదు. నువ్వీ సైకిల్ తీసుకెళ్లు'' అన్నాడు.

''ఇది నా సైకిల్ కాదుసార్. నా సైకిలు కొత్తది. కొని ఇంకా ఆరేళ్ళుకూడా కాలేదు.''

ఎస్సైకి పిచ్చి కోపమొచ్చి గణపతి జుట్టు పట్టుకుని ఈడ్చి ''కావాలంటే ఈ సైకిల్ తీసుకెళ్లు. ఇష్టంలేకపోతే వద్దు. మళ్లీ ఇంకెప్పుడైనా సైకిలంటూ స్టేషన్‌కొచ్చావో నిన్ను చంపి నేను జైలుకెళతాను'' అన్నాడు పళ్ళు పటపట కొరుకుతూ.

ఇక మారు మాట్లాడకుండా గణపతి సైకిల్ తీసుకుని మెల్లగా బయటకొచ్చాడు. బయటకురాగానే అతని మిత్రుడు రామచంద్రం కనిపించి నవ్వి ''ఏంట్రా పతీ! ఆ పంచెకట్టుడేంటి? షర్టు లేకుండా ఒంటిమీద ఆ బనియనేంటి? ఏమిటీ వేషం?'' అనడిగాడు.

గణపతి ముసిముసిగా నవ్వి మెల్లగా సైకిల్‌ను నడుపుకుంటూ వస్తూ ''ఈ వేషం సైకిల్ కోసం వేసాను'' అన్నాడు.

అర్థం కానట్టు చూసాడు రామచంద్రం.

మిత్రుడి ఫీలింగ్స్ గమనించిన పతి ''ప్రాణ మిత్రుడివి కాబట్టి రహస్యం చెబుతున్నాను. ఇంకెవ్వరికీ ఈ విషయం చెప్పకు. ఎస్సైకు సైకిల్ పోయిందని కంప్లైంట్ ఇచ్చి ఆయన ఓపిక చచ్చేవరకూ సైకిల్ సైకిల్ అంటూ అమాయకంగా స్టేషన్ చుట్టు తిరిగాను. ఆయన నా బాధ చూడలేక అక్కడ మూలనున్న సైకిల్ నాకిచ్చాడు'' చెప్పాడు.

రామచంద్రం ఆశ్చర్యపోయి ''అరె! విచిత్రంగా ఉందే. ఎస్సై ఈ సైకిల్ నీకే ఇస్తాడని ఎలా ఊహించావ్? అసలు నీకీ ఐడియా ఎలా వచ్చింది?'' అడిగాడు.

''మా బామ్మర్ది రాజా లేడూ. వాడికున్న హెర్క్యులెస్ సైకిల్‌పోతే పోలీస్ స్టేషన్‌లో రిపోర్టిచ్చాడు. ఐదునెలలపాటు స్టేషన్ చుట్టూ తిరిగి తిరిగాక వాడి నస భరించలేక సైకిల్ దొంగల నుండి స్వాధీనం చేసుకున్న హీరో సైకిలిచ్చి పంపారు.

ఒక కంపెనీ సైకిల్ పోయిందని రిపోర్టు ఇస్తే ఇంకో కంపెనీ సైకిలిచ్చి పంపారుగదా. అసలు సైకిల్ పోకున్నా సైకిల్ పోయిందని రిపోర్టు ఇచ్చి స్టేషన్ చుట్టూ తిరిగితే... అనే ఆలోచన వచ్చింది. స్టేషన్‌లో ఓ మూలన రెండేళ్ళనుండి ఒక సైకిల్ ఉండడం గమనించాను. ఎందుకైనా మంచిది ప్రయత్నం చేద్దామని వేషం, భాష మార్చి ఓ పాచిక అలా విసిరాను. పాచిక పారింది. స్టేషన్‌లో మూలన పడివున్న సైకిల్ నాచేతికొచ్చింది'' వివరించి చెప్పాడు గణపతి.

విన్న రామచంద్రం బుర్ర బొంగరంలా గిర్రున తిరిగింది.

★